

పిల్లలను బడికి పంపాలి

ప్రజాశక్తి-జి.మాడుగుల: బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ కూర్మారావు తెలిపారు. మండలంలోని వీ.కోడపల్లి, నుర్మతి, రాపల్లి గ్రామాల్లోని పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమలో భాగంగా ఆయన మాట్లాడుతూ, 6 ఏళ్ల నుండి 14 ఏళ్ల వయసు గల బాలలకు నిర్బంధ ఉచిత పాఠశాల విద్యను అందించాలన్నారు. బడిలో చేర్పించడం కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కూర్మారావు

కాలినడకన పాఠశాలకు...

-కొండ కోనలు దాటి రెండు కిలోమీటర్ల మేర రాకపోకలు

- అవస్థలు పడుతున్న విద్యార్థులు -పట్టించుకోని అధికారులు

- నూతన ప్రభుత్వం స్పందించాలని తల్లిదండ్రుల వినతి



కొండల్లో నడుచుకుంటూ వెళుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ మండలం మాదల పంచాయతీ మారుమూల పొట్టంగిపాడు గ్రామంలో పాఠశాల లేదు. దీంతో, అక్కడి విద్యార్థులు రోజూ రెండు కిలోమీటర్ల దూరం కొండలు, గుట్టలు దాటి నడిచి పక్క గ్రామంలో ఉన్న సరుబెడ్డ మండల పరిషత్ పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. విద్యార్థులు రోజు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 16 మంది విద్యార్థులు కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. వర్షాలకు పిల్లలకు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోనే పాఠశాల ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా స్పందించ లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ పాఠశాలకు పంపించాలనంటేనే భయంగా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్న ఇప్పటికైనా నూతన ప్రభుత్వం స్పందించి పొట్టంగిపాడు గ్రామంలో స్కూల్ భవనం నిర్మించి, ఉపాధ్యాయుడు నియమించి విద్య అందించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, పలు సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

15 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని చీడిపాలెం గ్రామ సమీపంలో 15 కిలోల గంజాయి పట్టుబడినట్లు కొయ్యూరు ఎస్సై రామకృష్ణ తెలిపారు. గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ తమ సిబ్బందితో కలిసి చీడిపాలెం గ్రామ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో బూదరాళ్ల వైపు నుంచి వస్తున్న ఒక ద్విచక్ర వాహనం, ఆటోను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. ఈ మేరకు గంజాయితో పాటు ఆ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న దారకొండ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, తమిళనాడు రాష్ట్రానికి చెందిన మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా గంజాయి సాగు, రవాణాకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండండి

కలెక్టర్ విజయ సునీత



సమావేశంలో మాట్లడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: డయేరియా నియంత్రణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను చైతన్యం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలు సుమారు లక్ష మంది ఉన్నందున వారికి డయేరియా సోకకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. నీటిని కాచి వడపోసి తాగేలా అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో 17 సచివాలయాల పరిధిలో నీటి కాలుష్యం ఉన్నట్లు గుర్తించడం జరిగిందని, ఆయా ప్రాంతాలలో బ్లీచింగ్, క్లోరినేషన్ ముమ్మరం చేయాలని సూచించారు. నీటి శాంపిల్స్ ఎప్పటికప్పుడు తీసి పరిశీలించాలని ఆదేశించారు. నీటి టెస్టింగ్ కిట్లను ప్రతి సచివాలయం, పంచాయతీ పరిధిలో అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినందున వైద్య ఆరోగ్య, నీటి సరఫరా, పంచాయతి శాఖలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డయేరియా మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పూర్తి స్థాయిలో అందుబాటులో సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల, పిల్లల ఆరోగ్య పరిరక్షణ, అవసరమైన మందులు వాడకం చాలా ముఖ్యమని, ఎవరైనా అనుమానం ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి తగు చికిత్స తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఎక్కడా కూడా మందులు లేవు, డాక్టర్లు అందుబాటులో లేరు, సరిగా స్పందించ లేదు అని తెలిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు అందుకు సంబంధించిన సమాచారాన్ని అందరికీ అందుబాటులో ఉంచాలన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా మాట్లాడుతూ, డయేరియాకి సంబంధించి మందుల కొరత లేదని స్పష్టం చేసారు. 3.75 లక్షల ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయని, 7,500 జింక్ ఫ్లూయిడ్స్, వంద బ్లీచింగ్ పౌడర్ బ్యాగ్స్, మెట్రోజిల్, ఫ్యురజిలోడైన్, సిఫ్రాన్ మాత్రలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ కృష్ణారావు, డిఎంఒ ప్రసాద రావు, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు విశ్వామిత్ర, ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి, జిల్లా పంచాయతి అధికారి కొండల రావు, ఆర్డబ్ల్యుఎస్ ఇఇ పి.లీలాకృష్ణ పాల్గొన్నారు.

నీట్‌పై విచారణ చేపట్టాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-పాడేరు: నీట్ పరీక్ష ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారంపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాడేరులో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్ కృష్ణ మాట్లాడుతూ, ఎన్‌టిఎ ఆధ్వర్యంలో నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై తక్షణమే సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణ నుండి ఎన్‌టిఏను తప్పించాలని, పరీక్షల పేరుతో విద్యను కేంద్రీకరించడం ఆపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్ శ్రీను, సభ్యులు పాంగి చిన్నారావు, గోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు



విత్తనాల కోసం నమోదు చేస్తున్న సిబ్బంది

రైతులకు రాయితీపై విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు ప్రభుత్వ రాయితీపై సరఫరా చేసే వరి విత్తనాలను శుక్రవారం ఆ పంచాయతీ సర్పంచ్ సింహాచలం, వైస్ ఎంపిపి అంబటి నూకాలమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన రైతులు వ్యాపారుల వద్ద, దళారుల వద్ద విత్తనాలను కొనుగోలు చేయొద్దని సూచించారు. ప్రభుత్వం 90 శాతం రాయితీపై రైతు భరోసా కేంద్రాల వద్ద పంపిణీ చేస్తున్న నాణ్యమైన విత్తనాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.



గ్రామాలకు కాలి బాట మాత్రమే ఉన్న దృశ్యం, గెడ్డపై కర్రలతో కట్టిన వంతెన

రహదారి సౌకర్యం లేక అవస్థలు

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం యు.చీడిపాలెం పంచాయితీ పరిధి రేవులకోట, పాలకజీడి, ఎర్రవరం, నీలవరం, మర్రిపాకాల తదితర గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక ఆ గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మోటర్ సైకిల్ కూడా వెళ్లడానికి వీల్లేకుండా ఉండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రేషన్ బియ్యం కూడా కాలినడకన వెళ్లి మోసుకుంటూ తీసుకురావాల్సిన దుస్థితి నెలకొంది. ఇక వర్షా కాలంలో గెడ్డలో వరదనీరు పొంగితే ఆయా గ్రామాలను రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. అనారోగ్యానికి గురైనప్పుడు, గర్భిణులను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే డోలి మోతలే దిక్కు. తమ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని గత ప్రభుత్వంలో అనేకసార్లు ఆర్జీలు పెట్టుకున్నా నాయకులు, అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వమైనా తమ మొర ఆలకించి తమ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

17 నెలల వేతనాలు చెల్లించండి : సిఐటియు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో క్షేత్రస్థాయిలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు గత 17 నెలలుగా వేతనాలు మంజూరు కాలేదని, తక్షణమే చెల్లించాలని సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో కొంట్యాడ సన్యాసిరావు అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల యూనియన్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఉద్యోగుల పట్ల గత ప్రభుత్వం, ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహించారని తక్షణం నూతన ప్రభుత్వం బకాయి పడ్డ 17 నెలల జీతాలు చెలించాలన్నారు. కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రామాల్లో తిరుగుతూ రైతులను చైతన్యం చేస్తున్న ఉద్యోగులకు ట్రావెలింగ్ అలవెన్స్ ఇవ్వాలని తెలిపారు. కొంతమంది అధికారులు ఉద్యోగులకు ఇచ్చే కొద్దిపాటి వేతనాల్లో కోతలు విధించాలని చూస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు.. ఉద్యోగులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సురా అప్పారావు, కూడా వెంకట్రావు, దిసరి సన్యాసిరావు, ఎం.మహేశ్వరి కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి

- ఉపాధ్యాయులు సక్రమంగా బోధించాలి

- జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలు పెంచాలని జెడ్పిటిసి దీసరి గంగరాజు సూచించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, మండలంలో అక్షరాస్యత శాతం బాగా తగ్గిందన్నారు. ప్రైమరీ పాఠశాలలలో ఒకటవ తరగతి నుండి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు కనీస తెలుగు అక్షర పదాలు కూడా పాఠ్య పుస్తకం చూసి చదవలేని పరిస్థితిలో ఉన్నారన్నారు.ఐదవ తరగతి పూర్తి అనంతరం ఆరవ తరగతి ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలలో అడ్మిషన్ కోసం వెళ్లడంతో అక్కడ ఉపాధ్యాయులు పరీక్షించగా కనీసం తెలుగు అక్షరాలు కూడా చదవలేని పరిస్థితిలో ఉన్నారన్నారు.మండలం పై విద్యా శాఖ అధికారుల నిర్లక్ష్యంత ఈ పస్థితి ఏర్పడిందన్నారు.పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు కాలేజీలలో చేరేందుకు వెళ్లినప్పుడు కూడా ఇదే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మండలమంతా విద్యా బోధనలో మార్పు రావాలని, దీనిపై మండల స్థాయి నుండి పంచాయతీ స్థాయి ప్రజాప్రతినిధులు దృష్టి సాలించవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. గుమ్మ పంచాయతీ కడరేవు, మూడు గ్రామాల విద్యార్థులు సుమారు 25 మంది ఉన్నప్పటికీ నేటికీ పాఠశాలను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదన్నారు.కొండకోన ఎక్కి అటవీ ప్రాంతం మీదుగా సుమారు 3 కిలో మీటర్ల దూరం కర్రిగొడ పాఠశాలకు వెళవలసి వస్తుందని, పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు.

ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం



అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేస్తున్న రంపచోడవరం, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు మిరియాల శిరీషాదేవి, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆమె చేత ప్రమాణం చేయించారు. శిరీషాదేవి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన శిరీషాదేవికి ఏజెన్సీలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గిరిజనులు శుభాకాంక్షలు తెలిపారు. ఏజెన్సీలో నెలకొన్న ప్రధాన సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించాలని వారు కోరారు. ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం సందర్భంగా రాజవొమ్మంగి గాంధీ సెంటర్ వద్ద టిడిపి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గొల్లపూడి పెద్దిరాజు, ముప్పన డింబ కేశవరావు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

పాడేరు : పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ గోరెంట్ల బుచ్చయ్యచౌదరి వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఎం.విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం ఇద్దరూ తొలిసారిగా ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టారు.

మంత్రి సంధ్యారాణిని కలిసిన రంపచోడవరం ఎమ్మెల్యే

రాజవొమ్మంగి : అమరావతిలోని ఎపి అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం పూర్తి అయిన తర్వాత రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని శుక్రవారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఆమె భర్త విజయ భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిశారు. రంపచోడవరం నియోజకవర్గంలో అభివృద్ధికి సహకరించాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణిని వారు కోరారు.

కన్నయ్య ఆశయ సాధనకు కృషి

ఘనంగా నివాళులర్పించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని తులసిపాక గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కామ్రేడ్ కట్టం కన్నయ్య అనారోగ్యంతో బుధవారం తన స్వగ్రహంలో మృతి చెందారు. ఆయన మృతదేహంపై సిపిఎం పతాకాన్ని ఆ పార్టీ నాయకులు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తులసిపాకలో నిర్వహించిన సంతాప సభలో సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ చింతూరు మండలంలోని సిపిఎం ఉద్యమ నిర్మాతలు బత్తుల భీష్మారావు, శ్యామల వెంకటరెడ్డి నాయకత్వంలో ఆదివాసీ సమస్యల పరిష్కారం కోసం చదలవాడ పంచాయతీ కేంద్రంగా కన్నయ్య అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. సర్పంచ్‌గా, సమితి సభ్యుడిగా కన్నయ్య మండల స్థాయి పంచాయతీ స్థాయి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేశారని తెలిపారు. కన్నయ్య సేవలను పార్టీ ఎన్నటికీ మరవదని, ఆయన కుటుంబానికి పార్టీ అండదండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పల్లపు వెంకట్, గుర్రం రంగమ్మ, పోడియం లక్ష్మణ్, ముట్టం రాజయ్య, కారం సుబ్బారావు, కలముల ముత్తయ్య, కలుముల మల్లేష్, దారయ్య, పుసం వీరయ్య, సత్తిబాబు, కుటుంబ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



కన్నయ్య మృతదేహంపై సిపిఎం జెండా కప్పి నివాళులర్పిస్తున్న నాయకులు

బోరు బాగుచేయరూ..?



బోరును పరిశీలిస్తున్న వైస్ ఎంపిపి

ప్రజాశక్తి-హుకుంపేట : స్థానిక సాయిబాబా గుడి వద్దనున్న తాగునీటి బోరు మరమ్మతులు చేపట్టి తాగునీటి సౌకర్యం కల్పించాలని వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు కోరారు. బోరును పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, బోరు పాడై నెల రోజుల పై బడినా మరమ్మతు చేయక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటీవల మోద కొండమ్మ ఉత్సవాల్లో నీరు లేక అల్లాడిపోయారని తెలిపారు.మరమ్మతు చేయకుంటే ఎంపీడీఓ కార్యాలయం వద్ద మహిళలతో ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ.కార్యక్రమంలో చౌంపి అప్పల స్వామి, బస్కి బారికి ప్రసాద్, మనీషా, పోయిభ అమ్మలు, గౌరి, గుండ్రన్న పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సిఐ రమేష్

ప్రజాశక్తి-జి.మాడుగుల: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరండా ఉండాలని స్థానిక సిఐ రమేష్ సూచించారు. స్థానిక జూనియర్ కళాశాల ను శుక్రవారం, సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకూడదని, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

కెజిబివిల్లో సీట్ల సంఖ్యను పెంచాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: కేజీబీవీ పాఠశాలల్లో తరగతుల వారీగా విద్యార్థుల ప్రవేశాల సీట్ల సంఖ్యను పెంచాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఆన్లైన్ విధానంతో మారుమూల ప్రాంత గిరిజనులకు సమాచారం తెలియలేదన్నారు. దీంతో ముందుగా ఆన్లైన్ చేసుకోలేక పోతున్నారన్నారు. ఈ కారణంగా డ్రాప్ అవుట్ అయిన విద్యార్థులు పాఠశాలల్లో చేరలేకపోతున్నారని చెప్పారు. తక్షణమే ఉన్నతా ధికారులు స్పందించి కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థుల సీట్ల సంఖ్యలను పెంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం



చింతపల్లిలో యోగా చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్:అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో తలారిసింగి టిడబ్ల్యూ ఆశ్రమ బాలుర పాఠశాల మైదానంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి యోగాసనాలు చాలా అవసరమని, యోగాను జీవితంలో నిబద్ధతతో కూడిన అలవాటుగా చేసుకోవాలన్నారు. యోగా చేయడంతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. డిఇఒతో పాటు కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు యోగాసనాలు చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐఇ కోఆర్డినేటర్ కొమ్మ భాస్కరరావు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. ప్రతిరోజు విద్యార్థులు యోగా సాధన చేయడం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. మానసిక ఉల్లాసం కలగడమే కాక, ఏకగ్రత పెరిగి చదువులో బాగా రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఒ జి.సింహాచలం, సమగ్ర శిక్ష సిబ్బంది, ఎంఇఒలు, హెచ్ఎంలు, పిడిలు, పాఠశాలల సిబ్బంది, సిఆర్పిలు, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి:యోగాతో మనసు ప్రశాంతంగా ఉంటుందని ఎంపీడీవో వీర సాయిబాబా తెలిపారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కొండలరావు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు.ఎంఈఓ పనసల ప్రసాద్, ఉపాధ్యాయురాలు వరలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ జాన్ పాల్గొన్నారు.

హుకుంపేట:యోగా, ధ్యానంతో ఏకగ్రతను పెంపొందించుకోవచ్చని డిఎంహెచ్ఓ జమాల్ భాష తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి యోగా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యోగాతో పలు రకాల వ్యాధులు దరిచేరన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి గాయత్రి, హెల్త్ సూపర్వైజర్ సాంబశివరావు, సిబ్బంది మూర్తి, యోగి పాల్గొన్నారు.

-సీలేరు:ప్రపంచ యోగా దినోత్సవం సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్ గ్రౌండ్లో జూనియర్ కళాశాల, డిఎవి విద్యార్థులచే వివిధ రూపాల్లో యోగ ఆసనాలు వేయించారు. ఇందులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ వినోద్ చందు పాండే, సీలేరు ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ యోగా వలన శరీర దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిఆర్పిఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని డౌనూరులో ఆర్ట్ లివింగ్ సంస్థ ప్రతినిధులు యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్ లివింగ్ సంస్థ టీచర్ జలుమూరి వెంకట గిరిబాబు స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బందితో కలిపి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లలిత, డాక్టర్ వరప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ఎస్.ప్రభుదాస్ మాట్లాడుతూ విద్యార్థులు రోజూ ధ్యానం, యోగా చేయడం వలన ఉత్సాహంగా వుండి అన్ని విషయాలలో ఉన్నతులుగా వుంటారని, ఒత్తిడిని తట్టుకునే శక్తి వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్.నానిబాబు, పీడీ ఎస్.పోతురాజు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రంపచోడవరం : ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని బందపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, పెద్దగద్దాడ ఆశ్రమ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో సోళ్ళ బొజ్జిరెడ్డి, తుర్రం బాబూరావు దొర మడకం ప్రసాద్ దొర పాల్గొన్నారు.

సాగు, సస్యరక్షణపై అవగాహన

ప్రజాశక్తి- ఆనందపురం:గ్రామీణ కృషి, మౌసమ్ సేవా పథకం(జికెఎంఎస్) కింద సాగు, సస్యరక్షణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ పివికె.జగన్నాథరావు పాల్గొని, వాతావరణ సూచనలు, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలపై వివరించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు వ్యవసాయ శాస్త్రవేత్తలంతా బృందంగా సలహాలను క్రోడీకరించి, రైతులు, ప్రజలకు వాతావరణ సూచనలు అందజేస్తున్నట్లు తెలిపారు.

జికెఎంఎస్ నోడల్ ఆఫీసర్, సేద్యశాస్త్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి గౌరి ఈపథకం ప్రత్యేకతలను వివరించారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం హార్టీకల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ సత్తిబాబు ఉద్యానవన పంటల సాగు, సస్యరక్షణపై రైతులకు వివరించారు సీనియర్ శాస్త్రవేత్త (తెగుళ్ళ విభాగం) డాక్టర్ వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ, పంటలను ఆశించే తెగుళ్లు, చీడపీడలు, సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ డి.అనిల్కుమార్ వరి, కాయగూరల పంటలను ఆశించే పురుగులు, వాటి నివారణ చర్యలపై వివరించడంతోపాటు రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె అప్పలస్వామి, సూక్ష్మ బిందుసేద్యం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.మన్మధరావు, జిల్లా శిక్షణ కేంద్రం ఎడిఎ చదువుల సుబ్రహ్మణ్యం, ఏడిఏ విజయకుమార్, మండల వ్యవసాయాధికారి సిహెచ్ సంధ్యరత్నప్రభ, ఆర్ఎజికెఎంఎస్ ఎ.అలివేణి, ఎఇ సురేష్, వ్యవసాయ సహాయకుల రమేష్, గౌస్,వినూత్న, దిలీప్, ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండల రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాలుగా సౌకర్యాలు కల్పిస్తుందని, వాటిని ఉపయోగించుకుని బాగా చదువుకోవాలని పంచాయితీ సర్పంచ్ పి కొములు కోరారు. మండలంలోని కొర్రాయి పంచాయతీ పరిధి చిన్న అంజోడ గ్రామంలో ఎంపీపీ స్కూల్లో పాఠ్య, నోట్ పుస్తకాలను, యూనిఫామ్ను శుక్రవారం పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ సహదేవ్, అలెక్, మోహనదాస్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు ఉషేన్ పాల్గొన్నారు.

అరకులోయలో భారీ వర్షం



కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి- అరకులోయ:మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది .ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో గ్రామాల్లోని చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. పెద్ద పెద్ద పిడుగులు పడటంతో ఈ ప్రాంతవాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈదురుగాలితో కూడిన కుండపోత వర్షం కురవడంతో అరకులోయలోని అరకు-విశాఖ ప్రధాన రహదారి వర్షపు నీటితో నిండింది. దీంతో. ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ గత వారం రోజులుగా తీవ్రమైన ఎండ వేడిమితో ఈ ప్రాంత వాసులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి వాతావరణం కొంత చల్లబడంతో అందరూ ఉపశమనం పొందారు.

గుండెపోటుతో పాత్రికేయుడు మృతి



విజయకుమార్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని చిలకలగెడ్డలో ఓ పాత్రికేయుడు గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన పాత్రికేయుడు ఎల్బి.విజయకుమార్ (40)కు తన ఇంటి వద్ద గుండెపోటు రావడంతో కుప్పకూలి పోయాడు. వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులు ఎస్ కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి స్థానిక జెడ్పిటిసి దీసరి, గంగరాజు, ఎంపీపీ శెట్టి నీలవేణీతో పాటు మండల పాత్రికేయులు రామన్న, ప్రవీణ్, లక్ష్మణ్, వెంకటేష్లు నివాళులర్పించారు.



పోస్టర్ను ఆవిష్కరిస్తున్న జెసి మయూర్ అశోక్

పారా అథ్లెటిక్స్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం వేదికగా పోలీస్ బేరక్స్ గ్రౌండ్లో ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న ఐదో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీల పోస్టర్ను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ శుక్రవారం ఆవిష్కరించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఈ రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ పోటీలకు అన్ని జిల్లాల నుంచి పారా క్రీడాకారులు హాజరై వారి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్కు ఎంపిక అవ్వాలని ఆకాంక్షించారు. పోటీలలో పాల్గొనే పారా క్రీడాకారులు 7013569514, 9390131777 నెంబర్లను సంప్రదించి వెంటనే వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కో - ఆర్డినేటర్ వై.శ్రీనివాస్గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి, ప్రతినిధులు బి.గణేష్, టి.ఉదయ్, హుస్సేన్ పాల్గొన్నారు.

ఉక్కు ఆస్తుల అమ్మకం నిలిపివేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశంలోని ప్రధాన నగరాలైన ముంబయి, ఢిల్లీ, చెన్నయ్, బెంగళూరు, హైదరాబాద్ల్లో విశాఖ స్టీల్ప్లాంట్కు ఉన్న సుమారు రూ.500 కోట్ల విలువైన భూములను, ఆస్తులను అమ్మే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఆస్తుల అమ్మకం స్టీల్ప్లాంట్ వ్యాపారాన్ని, అభివృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తుందని, ప్రైవేటీకరణ ప్రక్రియను వేగవంతం చేస్తుందని పేర్కొన్నారు. విశాఖలోని స్టీల్ప్లాంట్ భూములను అమ్మకానికి పెట్టడం, గంగవరం పోర్టు భూములను మోడీ తన ప్రియ మిత్రుడైన అదానీకి కట్టబెట్టడం వంటి చర్యలకు పాల్పడగా ప్రజలు, కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. ఇప్పుడు చెన్నయ్ భూములపైన అదానీ కన్ను పడిందని తెలిపారు. కీలక నగరాల్లో ఉన్న ఉక్కు గెస్ట్ హౌస్, మార్కెటింగ్ కార్యాలయాలు, భవనాలు, యార్డుల అమ్మకానికి పూనుకోవడం ఒక పథకం ప్రకారం విశాఖ స్టీల్ప్లాంట్ను దెబ్బతీయడమేనని తెలిపారు. ఒకవైపు సంస్థ ఉద్యోగులకు, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో జీతాలు, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా ప్లాంట్ను కష్టాల్లోకి నెడుతూ, మరోవైపు ఆస్తులు తెగనమ్మడానికి పూనుకోవడం స్టీల్ప్లాంట్ను బలహీనపరచడమేనన్నారు. బిజెపి నాయకత్వంలోని కేంద్ర ఎన్డిఎ ప్రభుత్వం తక్షణమే స్టీల్ప్లాంట్ ఆస్తుల అమ్మకాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్కు వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వడం, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం అందించడం వంటి సానుకూల చర్యలు కేంద్రం చేపడితే స్టీల్ప్లాంట్ లాభాల బాట పడుతుందని తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పించడమే కాకుండా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేల కోట్లు పన్నులు, డివిడెంట్లు రూపంలో ఆదాయం సమకూరుస్తున్న విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే అభివృద్ధి అవుతుందని పేర్కొన్నారు. ఆ మేరకు మోడీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోదని జగ్గునాయుడు ప్రశ్నించారు.

కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో స్టీల్ప్లాంట్ రక్షణ కోసం బిజెపి, టిడిపి కూటమి ఇచ్చిన హామీలను గుర్తుచేశారు. కేంద్రంలో సంకీర్ణ ఎన్డిఎ ప్రభుత్వం, ఆంధ్ర రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో స్టీల్ప్లాంట్ అమ్మకం ఆపి, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటారని కార్మికులు, ప్రజలు ఆశాభావంతో ఉన్నారన్నారు. వారి ఆశలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టీల్ప్లాంట్ ఆస్తుల అమ్మకాన్ని ఆపించి, ప్లాంటుకు ఆర్థికంగా బలం చేకూర్చే అన్ని చర్యలనూ తక్షణమే చేపట్టాలని కోరారు.



ఇదేం.. మద్దతు

- పెరుగుతున్న పెట్టుబడులు
- రెట్టింపు ఆదాయ హామీని విస్మరించిన కేంద్రం
- స్వల్పంగా పెంచిన మద్దతు ధరపై రైతులు పెదవి విరుపు
- స్వామినాథన్ సిఫార్సుల అమలుతోనే మోక్షం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, రోలుగుంట విలేకరి

కేంద్ర ప్రభుత్వం తాజాగా వరికి ప్రకటించిన కనీస మద్దతు ధర రైతుకు ఊరటనిచ్చేలాలేదు. పెరిగిన పెట్టుబడులకు, పెంచిన మద్దతు ధరకు పొంతనలేదు. ఇటీవల వరి కనీస మద్దతు ధర (ఎంఎస్పి) క్వింటాల్కు రూ.117ను కేంద్రం పెంచింది. అయితే, ఎరువులు, పురుగు మందులు వినియోగం తగ్గించి సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయ దిగుబడులు పెంచేందుకు దోహదపడ్డ పచ్చిరొట్ట విత్తనాలు మొదలుకొని, వరి, ఇతర విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు అమాంతంగా పెంచుతూ వస్తున్న ప్రభుత్వాలు ఆ మేరకు రైతు పంటకు మద్దతు ధర కల్పించడంలేదు. 2023లో రూ.4,850 వున్న క్వింటా పిల్లి పెసర విత్తనం ధరను ఈ ఏడాది ఖరీఫ్ నాటికి రూ.6,700కు ప్రభుత్వం పెంచింది. ఒక ఏడాదిలో క్వింటా పిల్లిపెసర విత్తనంపై రూ.1850 పెరగ్గా, కేంద్ర ప్రభుత్వం క్వింటా వరిపై రూ.117 పెంచింది. నెల్లూరు సన్నాలు 34449 రకం వరి విత్తనాల ధర 2023లో రూ.2,410 వుండగా ఈ ఏడాది రూ.3050కు రైతుకు ప్రభుత్వం సరఫరా చేస్తోంది. గతేడాది కంటే ఈ ఖరీఫ్ నాటికి నెల్లూరు సన్నాలు క్వింటా వరి విత్తనంపై రూ.640 పెంచింది. ఇంకా ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగాయి. సరాసరి ఎకరాకు 20 క్వింటాల్ వరి పండించిన రైతు తమ పంటను అమ్ముకోగలిగితే ప్రస్తుత ధర కంటే అదనంగా వచ్చే ఆదాయం రూ.2,340 మాత్రమే.

ఆకు మడులు దున్నినప్పటి నుంచి వరి పంట నూర్పిడి వరకు వివిధ రూపాల్లో రైతు (తమ కుటుంబ శ్రమపోనూ) పెట్టిన పెట్టుబడి ఎకరాకు రూ.25,750 అవుతోంది. వాతావరణ పరిస్థితులన్నీ అనుకూలంగా వుండి, ఎకరాకు 20 క్వింటాల్ వరి దిగుబడి వస్తే ప్రభుత్వం పెంచిన మద్దతు ధర రూ.117తో కలుపుకొని వరి సాధారణ రకం రూ.2,300 చొప్పున ఎకరా పంట 46 వేలకు వస్తుంది. దీంట్లో కుటుంబ శ్రమ దాదాపు పది వేలు, పెట్టుబడి ఖర్చు రూ.25,750పోతే రైతుకు మిగిలినట్లు కన్పించే ఆదాయం కేవలం పది వేలు. నీటి వసతిలేని ప్రాంతాల్లో పెట్టుబడి ఖర్చు పెరుగుతుంది. సకాలంలో నీటి తడులు లేక పంట దిగుబడులు తగ్గుతుంటాయి.

ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించి రైతును ఆదుకోవాలని సిఫార్సు చేసింది. కానీ మోడీ ప్రభుత్వం రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలుచేస్తామని హామీ ఇచ్చి విస్మరించింది.

సబ్సిడీ తగ్గించడంతో రైతు పెట్టుబడి ఖర్చు పెరుగుతోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం జిల్లాలో 3.90 లక్షల మంది రైతుల్లో చిన్న, సన్నకారు రైతులు 3.75 లక్షల మంది వున్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన మద్దతు ధర కంటితుడుపు చర్యగా వుంది తప్పితే ఆదుకొనేలా లేదని రైతులు వాపోతున్నారు.

పెట్టుబడులకు సరిపోదు



వరి నారు మడి దుక్కులు, విత్తనాలు, దమ్ము, చదును, ఉడుపు, డిఎపి, యూరియా, గాబులు, కోత, వరి నూర్పులకు కలిపి కుటుంబ సభ్యుల కష్టంపోనూ ఎకరాకు రూ.25,750 అవుతుంది. ఎకరాకు 20 క్వింటాల్ కంటే మించి పంట దిగుబడిరాదు. పంట పెట్టుబడికి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.117కు పొంతనలేదు. పెట్టుబడి ఖర్చులు తగ్గించి, పంటకు గిట్టుబాటు ధర కల్పించినప్పుడే రైతుకు మేలు జరుగుతుంది.

శ్రీనివాసరావు, రైతు, రోలుగుంట

అతిసార వ్యాప్తి చెందకుండా పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అతిసార వ్యాప్తి చెందకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అతిసార కేసులు నమోదు ,ఇతర సంఘటనల నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆయా జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ మేరకు కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిఎం అండ్ హెచ్ఒ, ఎంహెచ్ఒ, డిఎంఒ, జెడ్పి సిఇఒ, డిపిఒ తదితర అధికారులతో జిల్లా కలెక్టర్ మల్లికార్జున తన ఛాంబర్లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జిల్లాలో అతిసార వ్యాప్తి చెందకుండా, డెంగీ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని విభాగాల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి తాజా పరిస్థితులను గమనించాలన్నారు.



సముద్రంలో సాగుతున్న వెంకటేశ్వర స్వామి తెప్పోత్సవం

శోభాయమానం.. శ్రీ వెంకటేశ్వర స్వామి తెప్పోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్టు ఏరియాలోని శ్రీ శృంగమణి పర్వతంపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీ వెంకటేశ్వర స్వామి తెప్పోత్సవం శుక్రవారం సాయంత్రం శోభాయమానంగా జరిగింది. నాలుగు గంటల సమయంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో స్వామివారిని పల్లకిలో వేంచేయించి ఊరేగింపుగా మెట్ల మార్గం గుండా కిందకు తీసుకువచ్చారు. శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారు పల్లకిలో వేంచేయగా వేద పండితులు, అర్చక స్వాములు ఎదురు సన్నాహం, కొట్నాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ తరువాత స్వామివారిని పల్లకిలో ఊరేగింపుగా సముద్ర తీరానికి తీసుకువెళ్లారు. పూలతో నేత్రపర్వంగా అలంకరించిన లాంచీలో స్వామివారిని వేంచేయించారు. పోర్టు సమకూర్చిన లాంచీలు స్వామి వారు విహరించిన లాంచీని అనుసరించాయి. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఉత్సవాన్ని పర్యవేక్షించారు.

టమాటా ధరలు తగ్గించే చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టమాటా ధరలు అధికంగా ఉన్నందున వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణం రైతు బజార్లలో టమాటా ధరలు తగ్గే విధంగా మార్కెటింగ్ శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలని విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన ధరల పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా ఆర్టికల్చర్, ఉప మార్కెటింగ్ సంచాలకులు, జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ అధికారులు, అన్ని రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు, జ్ఞానాపురం హోల్సేల్ కూరగాయల వ్యాపారులు, గాజువాక హోల్సేల్ వ్యాపారులు పాల్గొన్నారు.

టమాటా, ఉల్లిపాయలు, కూరగాయలు లభ్యతతో పాటు వాటి ధరలపై చర్చించారు. అధిక వేడి, వర్షాలు కారణంగా టమాటా ఉత్పత్తి గణనీయంగా తగ్గడం వల్ల ధర అధికంగా ఉందని అధికారులు వివరించారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ జిల్లాకు కేటాయించిన రివాల్వింగ్ ఫండ్తో మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా టమాటా తక్కువ ధరకు లభ్యమయ్యే చోటగానీ, స్థానిక కూరగాయల హోల్సేల్ మార్కెట్ వద్దగానీ, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి కొనుగోలు చేసిగానీ రైతు బజార్ల ద్వారా వినియోగదారులకు లాభం, నష్టం లేని విధంగా అందించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నీట్ను రద్దు చేయాలని ఆందోళన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నీట్ పరీక్షను తక్షణం రద్దు చేయాలని, పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టిఎ)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్బాబు మాట్లాడారు. ఎన్టిఎ విడుదల చేసిన నీట్ పరీక్షా ఫలితాలలో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం, అందులో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్కు సంబంధించిన వారు కావడం అనేక అనుమానాలు కలిగిస్తోందని అన్నారు. పరీక్షను సమర్థవంతంగా నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి: యు.నాగరాజు, నాయకులు రవి సాయి, ప్రవీణ్ సాయి, కృష్ణ, హేమానంద్ పాల్గొన్నారు.